జ్వాల దశ

నిజం.. నిర్భయంగా..

WWW.DASHANEWS.COM

ఆదివారం
11-10-2026

సంపుటి 1 | సంచిక 319

పేజీలు : 04

వెల : 1/-

PRGI No : TGTEL/25/A4195



రాష్ట్ర వ్యాప్తంగా ఘనంగా బతుకమ్మ వేడుకలు

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను శనివారం రాష్ట్రవ్యాప్తంగా మహిళలు, యువతులు పూల బతుకమ్మలతో ఉత్సాహంగా జరుపుకున్నారు. సంప్రదాయ నృత్యాలు, పాటలతో పండుగ ప్రాంగణాలు సందడిగా మారాయి.



ఎమ్మెల్సీ ఎన్నికలపై కాంగ్రెస్ ఫోకస్

హైదరాబాద్: నల్గొండ-ఖమ్మం-వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల(Graduate MLC Elections)కు కాంగ్రెస్ పార్టీ సన్నద్ధమవుతోంది. ఇందులో భాగంగా ఖమ్మంలో నిర్వహించిన ఎన్నికల(Elections) సన్నాహక సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, పలువురు శాసనసభ్యులు పాల్గొన్నారు. ఎన్నికల్లో పార్టీ అభ్యర్థి విజయానికి అనుసరించాల్సిన కార్యాచరణపై నాయకులు, కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు.

సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని భట్టి విక్రమార్క(Bhatti Vikramarka) పార్టీ శ్రేణులకు సూచించారు. గృహజ్యోతి, రైతు భరోసా, చేయూత, ఉచిత విద్యుత్, సన్నబియ్యం పంపిణీ, ఇందిరమ్మ ఇళ్ల వంటి పథకాల వివరాలను ప్రతి గడపకూ చేరవేయాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వ పథకాల(Government schemes) ప్రయోజనాలను అర్హులైన ప్రజలకు వివరించడంతో పాటు, పట్టభద్రుల ఓటరు నమోదు ప్రక్రియపై ప్రత్యేక దృష్టి పెట్టాలని

..మిగతా 4వ పేజీలో ➔

హైదరాబాద్ అభివృద్ధిపై సీఎం రేవంత్ సమీక్ష

పీఆర్టీతో మెట్రో, ఎంఎంటీఎస్, బస్ స్టేషన్ల అనుసంధానం

500 ఎంఎల్‌డీ రీసైకిల్డ్ వాటర్ వినియోగానికి ప్రణాళిక

కేబీఆర్ పార్క్ వన్‌వే, ఫ్లైఓవర్ల పనులు వేగవంతం చేయాలని ఆదేశం



దశ, హైదరాబాద్: హైదరాబాద్ నగరంలో రవాణా సదుపాయాల మెరుగుదల, ట్రాఫిక్ సమస్యల పరిష్కారం, రీసైకిల్డ్ వాటర్ వినియోగాన్ని పెంచడంపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులతో సమీక్ష నిర్వహించారు. నగరంలో రద్దీ ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో పర్సనల్ ర్యాపిడ్ ట్రాన్సిట్ (పీఆర్టీ) వ్యవస్థ ఏర్పాటుకు అవసరమైన అంశాలపై అధికారులు ప్రజెంటేషన్ ఇచ్చారు. ఎక్కువ మంది రాకపోకలు సాగించే ప్రాంతాలతో పాటు పారిశ్రామిక ప్రాంతాలను మెట్రో, ఎంఎంటీఎస్, బస్ స్టేషన్లతో అనుసంధానించేలా పీఆర్టీ మార్గాలను రూపొందించాలని సీఎం సూచించారు. ప్రపంచంలోని అత్యుత్తమ పీఆర్టీ వ్యవస్థలను అధ్యయనం చేసి నివేదిక సమర్పించాలని, ప్రాజెక్టు పనులు త్వరగా ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నగరంలో వివిధ ప్రాంతాల మధ్య అనుసంధానత పెంచేందుకు ఫ్లైఓవర్లు, అండర్‌పాస్‌ల నిర్మాణాన్ని వేగవంతం చేయాలని తెలిపారు. కేబీఆర్ పార్క్ చుట్టూ వన్‌వే విధానం అమలుతో ట్రాఫిక్ సజావుగా సాగేలా చర్యలు చేపట్టాలని, నాగార్జున సర్కిల్ నుంచి జూబ్లీ చెక్‌పోస్టు వైపు ఫ్లైఓవర్ పనులను వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు. యుటిలిటీల తరలింపును త్వరగా పూర్తి చేసి, ప్రారంభించిన పనులను ఏడాదిలోపు పూర్తిచేసేలా ప్రణాళిక రూపొందించాలని చెప్పారు. ముంబై వంటి నగరాల్లో అమలు చేస్తున్న నిర్మాణ సాంకేతికత, పనుల నిర్వహణ విధానాలను అధ్యయనం చేయాలని సూచించారు. హైదరాబాద్-ముంబై బుల్లెట్ ట్రైన్ మార్గానికి సమాంతరంగా రేడియల్ రోడ్డు నిర్మాణంపై అధ్యయనం చేయాలని, శంకర్‌పల్లి-చేవెళ్ల మధ్య రహదారుల విస్తరణతో పాటు కొత్త రోడ్ల నిర్మాణ అవకాశాలను పరిశీలించాలని ఆదేశించారు. మరోవైపు, రీసైకిల్డ్ వాటర్ వినియోగాన్ని పెంచేందుకు 500 ఎంఎల్‌డీ నీటి వినియోగానికి ప్రణాళికలు సిద్ధం చేసినట్లు అధికారులు సీఎంకు వివరించారు.

భారత్

..మిగతా 4వ పేజీలో ➔



భూగర్భంలోకి విద్యుత్ లైన్లు

హైదరాబాద్‌లో 6,083 కి.మీ. అండర్‌గ్రౌండ్ కేబులింగ్

తొలి దశలో 11 డివిజన్లలో పనులు.. విద్యుత్ అంతరాయాలకు చెక్

దశ, హైదరాబాద్: హైదరాబాద్ నగర విద్యుత్ మౌలిక వసతులను ఆధునీకరించేందుకు తెలంగాణ ప్రభుత్వం కీలక ప్రాజెక్టును చేపట్టింది. తెలంగాణ దక్షిణ విద్యుత్ పంపిణీ సంస్థ (TGSPDCL) ఆధ్వర్యంలో హైదరాబాద్ భూగర్భ విద్యుత్ కేబులింగ్ ప్రాజెక్టు తొలి దశను అమలు చేయనున్నారు. ఇందులో భాగంగా 311 కిలోమీటర్ల మేర 33 కేవీ విద్యుత్ లైన్లను, 5,772 కిలోమీటర్ల మేర 11 కేవీ లైన్లను భూగర్భంలోకి మార్చనున్నారు. మొత్తం 6,083 కిలోమీటర్ల విద్యుత్ లైన్లను భూగర్భంలోకి తరలించడం ద్వారా సరఫరాలో అంతరాయాలను తగ్గించడంతోపాటు ప్రజల భద్రత, నగర సౌందర్యాన్ని మెరుగుపరచాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. బంజారాహిల్స్, గ్రీన్‌ల్యాండ్స్, సైఫాబాద్, ప్యారడైజ్, కంటోన్మెంట్, మెహదీపట్నం, చార్మినార్, బేగంబజార్, బోయిన్‌పల్లి, అస్మాన్‌గఢ్, ఆజామాబాద్ డివిజన్లలో ఈ పనులు చేపట్టనున్నారు. బంజారాహిల్స్, సికింద్రాబాద్, హైదరాబాద్ సెంట్రల్, హైదరాబాద్ సౌత్ సర్కిళ్ల పరిధిలో ప్రాజెక్టును అమలు చేయనున్నారు. ప్రస్తుతం విద్యుత్

..మిగతా 4వ పేజీలో ➔

శీతాకాలం

ఉన్నట్టా.. లేనట్టా?

అక్టోబర్‌లోనూ మండుతున్న ఎండలు.. కొనసాగుతున్న ఉక్కపోత

వర్షపాత లోటుతో ఆందోళన.. వాతావరణ మార్పులపై పెరుగుతున్న చర్చ

దశ, హైదరాబాద్: తెలంగాణలో అక్టోబర్ నెలలోనూ ఎండలు, ఉక్కపోత కొనసాగుతుండటంతో శీతాకాలం ఎప్పుడు ప్రారంభమవుతుందనే చర్చ మొదలైంది. సాధారణంగా నైరుతి రుతుపవనాల ఉపసంహరణతో వాతావరణంలో క్రమంగా మార్పులు చోటుచేసుకుని రాత్రి ఉష్ణోగ్రతలు తగ్గుతుంటాయి. అయితే ఈ ఏడాది అక్టోబర్ ప్రారంభంలోనూ పలు ప్రాంతాల్లో గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదవుతుండటంతో ప్రజలు ఉక్కపోతతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వాతావరణ మార్పులు, పట్టణీకరణ, పచ్చదనం తగ్గడం వంటి అంశాలు స్థానిక ఉష్ణోగ్రతలపై ప్రభావం చూపుతున్నాయనే ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు సాధారణం కంటే అధికంగా నమోదవుతున్నట్లు అందిన వివరాలు సూచిస్తున్నాయి. ఆదిలాబాద్‌లో 37 డిగ్రీలు, హైదరాబాద్‌లో 35 డిగ్రీలు, భద్రాచలం, మహబూబ్‌నగర్‌లో 36.2 డిగ్రీల సెల్సియస్

..మిగతా 4వ పేజీలో ➔



14న సింగరేణి కార్మిక గర్జన

రామగుండం వేదికగా బీఆర్ఎస్ పోరాటం.. హాజరుకానున్న కేటీఆర్, హరీశ్‌రావు

దశ, ఆదిలాబాద్ : సింగరేణి కార్మికుల సమస్యలపై కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీసేందుకు బీఆర్ఎస్ సిద్ధమవుతోంది. ఇందులో భాగంగా ఈ నెల 14న రామగుండంలో 'సింగరేణి కార్మిక గర్జన' సభ నిర్వహించనుంది. ఈ సభకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు తదితర నేతలు హాజరుకానున్నారు. సింగరేణి సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలమైందని బీఆర్ఎస్ ఆరోపిస్తోంది. సంస్థ లాభాల్లో కార్మికులకు అందే వాటా తగ్గిపోయిందని హరీశ్‌రావు విమర్శించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో 32 శాతం లాభాల వాటా

..మిగతా 4వ పేజీలో ➔




సైనేడ్ తాకి చిన్నారి మృతి

నగల దుకాణం ఎదుట బంధువుల ఆందోళన.. న్యాయం చేయాలని పోలీసులకు ఫిర్యాదు

దశ, మేడ్చల్: జీడిమెట్ల పోలీస్ స్టేషన్ పరిధిలోని చింతల్‌లో విషాద ఘటన చోటుచేసుకుంది. బంగారం కొనుగోలు చేసేందుకు తల్లితో కలిసి నగల దుకాణానికి వచ్చిన రెండేళ్ల ఐదు నెలల చిన్నారి మిషా మృతి చెందడం కలకలం రేపింది. చింతల్ కాశబజార్‌లోని విష్ణు జ్యువెలరీలో సైనేడ్ పదార్థాన్ని తాకడం వల్లే చిన్నారి మృతి చెందినట్లు సమాచారం. ఘటనతో తీవ్ర ఆవేదనకు గురైన కుటుంబ సభ్యులు, బంధువులు నగల దుకాణం ఎదుట ఆందోళనకు దిగారు. తమకు న్యాయం చేయాలని కోరుతూ జీడిమెట్ల పోలీసులను ఆశ్రయించారు. ఘటనకు దారితీసిన పరిస్థితులపై పోలీసులు విచారణ చేపట్టాల్సి ఉంది.

పౌరసరఫరాల శాఖ మేనేజర్‌కు 100 కోట్ల ఆస్తులు!

ఏసీబీ తనిఖీల్లో భారీగా అక్రమాస్తులు గుర్తింపు








ఆర్టీసీ యూనియన్ ఎన్నికల్లో అధికార పార్టీకి షాక్

కాంగ్రెస్ మద్దతు కూటమికి ఎదురుదెబ్బ.. ఈయూ, టీఎంయూ, ఎన్ఎంయూ కూటమి విజయం

దశ, హైదరాబాద్: తెలంగాణ ఆర్టీసీ కార్మిక సంఘాల గుర్తింపు ఎన్నికల్లో కాంగ్రెస్ మద్దతు ఇచ్చిన కూటమికి ఎదురుదెబ్బ తగిలింది. రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ హామీలు ఇవ్వడంతో పాటు, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్, హైదరాబాద్ మాజీ మేయర్

..మిగతా 4వ పేజీలో ➔



ఎమ్మెల్సీకే టోపీ.. రూ.25 లక్షలు స్వాహా!

4లో

శీతాకాలం ఉన్నట్టా.. లేనట్టా?



మొదటి పేజీ తరువాయి

ఉష్ణోగ్రతలు నమోదైనట్లు పేర్కొంటున్నారు. మరోవైపు, నైరుతి రుతుపవనాల కాలంలో రాష్ట్రంలో వర్షపాతం లోటు నమోదైనట్లు సమాచారం. హైదరాబాద్‌లోనూ వర్షాలు తక్కువగా కురవడం నీటి లభ్యతపై ఆందోళనలను పెంచుతోంది. అయితే వర్షపాత లోటు ఒక్కటే శీతాకాలం ఆలస్యానికి కారణమని చెప్పలేమని, ఉష్ణోగ్రతలు, గాలుల దిశ, తేమ తదితర వాతావరణ పరిస్థితులను కూడా పరిగణనలోకి తీసుకోవాల్సి ఉంటుంది. ఎల్‌నినో పరిస్థితుల ప్రభావం, ప్రపంచవ్యాప్తంగా చోటుచేసుకుంటున్న వాతావరణ మార్పులు కూడా ఈ ఏడాది వాతావరణంపై ఎలాంటి ప్రభావం చూపుతాయనే అంశంపై ఆసక్తి నెలకొంది. పట్టణాల్లో పచ్చదనం పెంపు, చెరువుల పరిరక్షణ, కర్బన ఉద్గారాల నియంత్రణ వంటి చర్యలు దీర్ఘకాలంలో పర్యావరణ సమతుల్యతకు దోహదపడతాయి. వాతావరణ మార్పులకు అనుగుణంగా తాగునీటి నిర్వహణ, వ్యవసాయ ప్రణాళికలు రూపొందించడం కూడా అవసరం. అయితే అక్టోబర్‌లో ఎండలు కొనసాగుతున్నాయనే కారణంతో ఈ ఏడాది తెలంగాణలో శీతాకాలం పూర్తిగా కనుమరుగవుతుందని నిర్ధారించలేం. రాబోయే వారాల్లో కనిష్ఠ ఉష్ణోగ్రతలు, గాలుల దిశ, వాతావరణ పరిస్థితుల్లో వచ్చే మార్పుల ఆధారంగానే చలి తీవ్రతపై స్పష్టత వస్తుంది. భారత వాతావరణ శాఖ తాజా అంచనాలను పరిశీలిస్తూ ప్రజలు, రైతులు వాతావరణ మార్పులకు అనుగుణంగా అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉంది.



భూగర్భంలోకి విద్యుత్ లైన్లు

మొదటి పేజీ తరువాయి

స్తంభాలపై ఉన్న లైన్లు చెట్లు విరిగిపడటం, బలమైన గాలులు, వర్షాల కారణంగా దెబ్బతిని సరఫరాకు అంతరాయం కలిగిస్తున్నాయి. భూగర్భ కేబులింగ్‌తో ఇలాంటి సమస్యలను గణనీయంగా తగ్గించవచ్చని అధికారులు భావిస్తున్నారు. రోడ్ల పక్కన, ఇళ్లకు సమీపంలో వేలాడే విద్యుత్ తీగల వల్ల ఎదురయ్యే ప్రమాదాలు తగ్గడంతోపాటు ఫుట్‌పాత్‌లపై నడిచే వారికి మరింత స్థలం అందుబాటులోకి రానుంది. చారిత్రక ప్రాంతాలు, వారసత్వ కట్టడాల పరిసరాల్లో విద్యుత్ తీగల గందరగోళం తగ్గి నగర రూపురేఖలు మెరుగుపడనున్నాయి. ఈ ప్రాజెక్టులో స్మార్ట్ గ్రిడ్ సాంకేతికతకు కూడా ప్రాధాన్యం ఇవ్వనున్నారు. ఎస్‌సీఏడీఏ (SCADA) ఆధారిత రింగ్ మెయిన్ యూనిట్ల ద్వారా విద్యుత్ నెట్‌వర్క్‌లో తలెత్తే లోపాలను వేగంగా గుర్తించి, ప్రభావిత ప్రాంతాన్ని వేరు చేసి సరఫరాను త్వరగా పునరుద్ధరించే అవకాశం ఉంటుంది. విద్యుత్ చౌర్యం, సాంకేతిక నష్టాలను తగ్గించడంలోనూ భూగర్భ కేబులింగ్ ఉపయోగపడుతుందని అధికారులు వెల్లడించారు. ప్రాజెక్టు అమలుతో హైదరాబాద్‌లో విద్యుత్ సరఫరా మరింత విశ్వసనీయంగా మారడంతోపాటు పెరుగుతున్న విద్యుత్ డిమాండ్‌కు అనుగుణంగా మౌలిక వసతులు బలోపేతం కానున్నాయి.

14న సింగరేణి కార్మిక గర్జన


మొదటి పేజీ తరువాయి

అందించగా, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత మొదటి ఏడాది 16 శాతానికి, 2024 25లో 12.5 శాతానికి తగ్గిందని ఆరోపించారు. సింగరేణి ఆర్థిక పరిస్థితి, కార్మికుల సంక్షేమం, లాభాల పంపిణీపై అధికార, ప్రతిపక్షాల మధ్య విమర్శలు కొనసాగుతున్నాయి. బ్యాంకుల్లో రూ.6,323 కోట్ల నిల్వలు ఉన్నప్పటికీ, మరో రూ.4,000 కోట్ల ఓవర్‌డ్రాఫ్ట్ ఎందుకు తీసుకోవాల్సి వచ్చిందని హరీశ్‌రావు ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. టెండర్లలో జాప్యం, అధిక వ్యయంతో కూడిన కాంట్రాక్టులు, ప్రభుత్వ నిర్ణయాల వల్లే సంస్థ ఆర్థిక పరిస్థితి దెబ్బతింటోందని బీఆర్ఎస్ వాదిస్తోంది. కార్మికుల సమస్యలను ప్రధాన అజెండాగా తీసుకుని ఉత్తర తెలంగాణలో పార్టీ బలాన్ని పెంచుకోవడంపై బీఆర్ఎస్ దృష్టి సారించింది. ఈ నేపథ్యంలో రామగుండంలో జరగనున్న కార్మిక గర్జన రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది.

నవంబర్ రెండో వారం నుంచి కాళేశ్వరం పనులు

2027 వర్షాకాలం నాటికి మూడు బ్యారేజీల పునరుద్ధరణ లక్ష్యం

సాంకేతిక అనుమతుల తర్వాత పనులు వేగవంతం



దశ, కరీంనగర్ : కాళేశ్వరం ఎత్తిపోతల ప్రాజెక్టులో కీలకమైన మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల పునరుద్ధరణ పనులను నవంబర్ రెండో వారం నుంచి ప్రారంభించాలని రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. 2027 వర్షాకాలం నాటికి మూడు బ్యారేజీల పునరుద్ధరణ పూర్తి చేయాలని నిర్ణయించినట్లు నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి వెల్లడించారు. నీటిపారుదల శాఖ ఉన్నతాధికారులతో నిర్వహించిన సమీక్షలో ఆయన ఈ విషయాన్ని తెలిపారు. బ్యారేజీలకు సంబంధించిన కొత్త డిజైన్లను కేంద్ర జల సంఘం, సాంకేతిక పర్యవేక్షణ కమిటీకి సమర్పించి, అవసరమైన అనుమతులు వచ్చిన వెంటనే పనులు చేపడతామని పేర్కొన్నారు. బ్యారేజీల భద్రత, నిర్మాణ నాణ్యత విషయంలో రాజీపడబోమని స్పష్టం చేశారు. జాతీయ డ్యామ్ భద్రతా సంస్థ సిఫార్సులు, జాతీయ సాంకేతిక సంస్థల సూచనలు, నిపుణుల కమిటీ అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని పునరుద్ధరణ ప్రణాళిక రూపొందిస్తున్నట్లు తెలిపారు. మూడు బ్యారేజీల్లో నీటి నిల్వ, వినియోగ సామర్థ్యాన్ని పునరుద్ధరించి రైతులకు సాగునీరు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. గోదావరి నదిపై నిర్మించిన కాళేశ్వరం ఎత్తిపోతల ప్రాజెక్టు తెలంగాణ సాగునీటి అవసరాలకు కీలకమైనది. 2016లో శంకుస్థాపన చేసిన ఈ ప్రాజెక్టు తొలి దశను 2019 జూన్ 21న ప్రారంభించారు. ఏడు లింకులు, 28 ప్యాకేజీలతో విస్తరించిన ఈ ప్రాజెక్టు ద్వారా మొత్తం 240 టీఎంసీల నీటిని వినియోగంలోకి తీసుకురావాలని ప్రణాళిక రూపొందించారు. ఇందులో సాగునీరు, హైదరాబాద్ తాగునీటి అవసరాలు, పారిశ్రామిక వినియోగం, గ్రామాల తాగునీటి అవసరాలకు కేటాయింపులు ఉన్నాయి. అయితే, 2023లో మేడిగడ్డ బ్యారేజీలో పిల్లర్లు కుంగిపోవడంతో ప్రాజెక్టు భద్రతపై ఆందోళనలు వ్యక్తమయ్యాయి. అప్పటి నుంచి బ్యారేజీల పునరుద్ధరణ, మరమ్మతులు, భద్రతా ప్రమాణాలపై చర్చ కొనసాగుతోంది. ప్రాజెక్టు నిర్మాణంలో అవకతవకలు జరిగాయని కాంగ్రెస్ ఆరోపిస్తుండగా, మరమ్మతులు చేపట్టి సాగునీటి వినియోగాన్ని పునరుద్ధరించాలని బీఆర్ఎస్ వాదిస్తోంది. ఈ నేపథ్యంలో సాంకేతిక అనుమతులు, పునరుద్ధరణ పనుల పురోగతి కీలకంగా మారాయి. నిర్ణీత గడువులో పనులు పూర్తయితే రైతులకు సాగునీటి సరఫరా మెరుగుపడే అవకాశం ఉంది.

కేసీఆర్ పాలన రావాలి.. కారు గెలవాలి!

బతుకమ్మ వేళ కేసీఆర్ చిత్రపటానికి పుష్పాభిషేకం



దశ, ఆదిలాబాద్: కేసీఆర్ పాలనలోనే తమ జీవితాలు సంతోషంగా సాగాయని, మళ్లీ బతుకులు బాగుపడాలంటే కేసీఆర్ అధికారంలోకి రావాలని ఆదిలాబాద్ జిల్లా ముఖరా (కె) గ్రామ మహిళలు ఆకాంక్షించారు. బతుకమ్మ పండుగ ప్రారంభం సందర్భంగా గ్రామంలోని బంతిపూల తోటలో కేసీఆర్ చిత్రపటానికి పుష్పాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రేవంత్‌రెడ్డి పాలనలో తమ జీవితాలు ఇబ్బందుల్లో పడ్డాయని ఆవేదన వ్యక్తం చేశారు. కేసీఆర్ హయాంలో ఆడబిడ్డలందరికీ బతుకమ్మ చీరలు అందించడంతో పాటు రాష్ట్రవ్యాప్తంగా పండుగను అధికారికంగా ఘనంగా నిర్వహించేవారని మహిళలు గుర్తు చేసుకున్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం బతుకమ్మ చీరలు పంపిణీ చేయకపోవడంతో మహిళలు నిరాశకు గురయ్యారని విమర్శించారు. గతంలో ప్రభుత్వం అందించిన చీరలు ధరించి గ్రామాల్లో ఎంతో సంబురంగా బతుకమ్మ ఆడుకునేవారమని పేర్కొన్నారు. కాంగ్రెస్ పాలనలో త్రీఫేజ్ విద్యుత్ సరఫరా సక్రమంగా లేక, సాగునీరు అందక పంటలు ఎండిపోతున్నాయని ఆరోపించారు. కేసీఆర్ హయాంలో 24 గంటల ఉచిత విద్యుత్, రైతుబంధు, సాగునీటి సదుపాయాలతో పాటు ఆడబిడ్డలకు కేసీఆర్ కిట్ వంటి పథకాలు అందేవని గుర్తు చేశారు. రైతులు, మహిళల సంక్షేమం కోసం మళ్లీ కేసీఆర్ పాలన రావాలని, రాబోయే రోజుల్లో కారు గుర్తుకు విజయం చేకూరాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గాడ్దే మీనాక్షితో పాటు అర్చన, ఇందుబాయి, రేఖ, సరోజ, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై హైదరాబాద్ పోలీసుల ఉక్కుపాదం

9 రాష్ట్రాల్లో దాడులు.. 35 మంది అరెస్ట్

బాధితులకు రూ.88.48 లక్షలు రీఫండ్.. 17.34 కోట్లకు పైగా మోసం



దశ, హైదరాబాద్: సైబర్ నేరగాళ్ల ఆటకట్టించేందుకు హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు సెప్టెంబర్ నెలలో దేశవ్యాప్తంగా ప్రత్యేక ఆపరేషన్లు నిర్వహించారు. మొత్తం 9 రాష్ట్రాల్లో దాడులు చేపట్టి 23 సైబర్ క్రైమ్ కేసులకు సంబంధించి 35 మంది నిందితులను అరెస్ట్ చేశారు. ఈ నెలలో 83 ఎఫ్ఐఆర్‌లు నమోదు చేయడంతో పాటు, నేరగాళ్ల ఖాతాల్లో నిలిపివేసిన మొత్తాల్లో నుంచి బాధితులకు రూ.88,48,134 తిరిగి ఇప్పించారు. అరెస్టయిన వారిలో తెలంగాణకు చెందినవారు 10 మంది, ఆంధ్రప్రదేశ్ నుంచి 9, మహారాష్ట్ర నుంచి 6, కేరళ, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాల నుంచి ముగ్గురేసి, బీహార్, హర్యానా, రాజస్థాన్, పంజాబ్ నుంచి ఒక్కొక్కరు ఉన్నారు. నిందితుల్లో సోషల్ మీడియా నేరాలకు సంబంధించి 9 మంది, పెట్టుబడి మోసాల్లో 7, డిజిటల్ అరెస్ట్ కేసుల్లో 6, ట్రేడింగ్ మోసాల్లో 5, ప్రకటనల మోసాల్లో ముగ్గురు, గుర్తింపు వివరాల దొంగతనానికి పాల్పడిన ఇద్దరు, బెదిరింపులు, ఉద్యోగ మోసం, కస్టమర్ కేర్ మోసాలకు సంబంధించి ఒక్కొక్కరు ఉన్నారు. వారి నుంచి 10 మొబైల్ ఫోన్లు, 7 చెక్‌బుక్‌లు, షెల్ కంపెనీకి చెందిన సీల్ స్టాంపును స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల వివరాల ప్రకారం, 38 కేసుల్లో బాధితులు మొత్తం రూ.17,34,96,158 నష్టపోయారు. ఇందులో ట్రేడింగ్ మోసాలకు సంబంధించి 11 కేసుల్లో రూ.8.43 కోట్లకు పైగా, పెట్టుబడి మోసాల 17 కేసుల్లో రూ.7.68 కోట్లకు పైగా నష్టం వాటిల్లింది. డిజిటల్ అరెస్ట్, ఓటీపీ, ఏపీకే ఫైల్, ప్రకటనల మోసాలు, అనధికార యూపీఐ లావాదేవీల ద్వారా కూడా బాధితులు భారీగా డబ్బు కోల్పోయారు. ఆయా కేసుల్లో పోలీసులు బాధితులకు మొత్తం రూ.88.48 లక్షలు తిరిగి ఇప్పించారు. మరోవైపు, జోనల్ సైబర్ సెల్స్ పరిధిలో 2,767 ఎన్‌సీఆర్‌పీ ఫిర్యాదులు అందగా, 381 ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యాయి. 10 కేసుల్లో 11 మంది నిందితులను అరెస్ట్ చేసి రూ.67.54 లక్షలు బాధితులకు రీఫండ్ చేశారు. సోషల్ మీడియా వేదికగా జరుగుతున్న అక్రమాలపైనా పోలీసులు ప్రత్యేక నిఘా పెట్టారు. మైనర్లను అసభ్యకరంగా చూపుతూ వీక్షణలు, లైక్‌లు, సబ్‌స్క్రైబర్లు, ఆదాయం పొందేందుకు ఉపయోగిస్తున్న 140 ప్రొఫైళ్లు, 30 పెయిడ్ ప్రకటనలను గుర్తించారు. పాత నాణాలు, ప్రత్యేక కరెన్సీ నోట్లు, బెట్టింగ్ అంచనాలు, గ్యారెంటీ గెలుపుల పేరుతో మోసాలు చేసే ఖాతాలతో పాటు, మ్యూటిమోనియల్, ప్రైవేట్ వీడియో కాల్స్, నకిలీ ఉద్యోగ ప్రకటనల ద్వారా డబ్బు, వ్యక్తిగత వివరాలు సేకరించే అనుమానాస్పద ఖాతాలపై చర్యలు చేపట్టారు. ఆన్‌లైన్ గేమింగ్, అక్రమ బెట్టింగ్, నకిలీ పెట్టుబడి వెబ్‌సైట్లను ప్రచారం చేస్తున్న 1,457 ప్రొఫైళ్లు, 2,603 పెయిడ్ ప్రకటనలను నిలిపివేసి, వాటిని ప్రమోట్ చేస్తున్న వారిపై 9 ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశారు. సైబర్ మోసాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అనుమానాస్పద లింకులు, పెట్టుబడి ఆఫర్లు, ఫోన్ కాల్స్ పట్ల జాగ్రత్త వహించాలని పోలీసులు సూచించారు.



పౌరసరఫరాల శాఖ మేనేజర్‌కు రూ.100 కోట్ల ఆస్తులు!

ఏసీబీ తనిఖీల్లో భారీగా అక్రమాస్తులు గుర్తింపు

దశ, మహబూబాబాద్: పౌరసరఫరాల శాఖ మేనేజర్ వాసంశెట్టి నరసింహారావుకు సంబంధించిన ఆస్తుల విలువ రూ.100 కోట్లకు పైగా ఉంటుందని ఏసీబీ అధికారులు అంచనా వేసినట్లు సమాచారం. ఆయనపై గతంలో రెండుసార్లు సస్పెన్షన్ వేటు పడగా, తాజాగా అందిన ఫిర్యాదుల నేపథ్యంలో అధికారులు తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీల్లో ఖమ్మం, సూర్యాపేట, నిజామాబాద్ జిల్లాల్లో 28 ఎకరాల భూమి, ఐదు ప్లాట్లు, ఖమ్మం, హైదరాబాద్‌లో భవనాలు ఉన్నట్లు గుర్తించినట్లు తెలిసింది. వీటితోపాటు 361 గ్రాముల బంగారం, రూ.33 లక్షల విలువైన వెండి ఉన్నట్లు గుర్తించినట్లు సమాచారం. గుర్తించిన ఆస్తుల మార్కెట్ విలువ రూ.100 కోట్లకు పైగా ఉంటుందని అధికారులు అంచనా వేసినట్లు తెలుస్తోంది. ఈ ఆస్తులకు సంబంధించిన వివరాలు, ఆదాయ వనరులపై విచారణ కొనసాగుతున్నట్లు సమాచారం.

ఎమ్మెల్సీ ఎన్నికలపై కాంగ్రెస్ ఫోకస్

మొదటి పేజీ తరువాయి

సూచించారు. అర్హులైన ప్రతి పట్టభద్రుడు ఓటరుగా నమోదు అయ్యేలా పార్టీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని స్పష్టం చేశారు. నల్గొండ-ఖమ్మం-వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ(Congress Party) బలపరిచిన అభ్యర్థి రాంరెడ్డి సర్వోత్తమ్‌రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించేందుకు సమష్టి కృషి అవసరమని భట్టి విక్రమార్క పేర్కొన్నారు. గ్రామస్థాయి నుంచి పార్టీ శ్రేణులన్నీ సమన్వయంతో పనిచేస్తూ ఎన్నికల కార్యాచరణను ముందుకు తీసుకెళ్లాలని సూచించారు. నాయకులు, కార్యకర్తలు బాధ్యతలను పంచుకుని, ఓటర్ల నమోదు నుంచి ప్రచారం వరకు ప్రతి దశలో చురుగ్గా పాల్గొనాలని పిలుపునిచ్చారు.ఎన్నికల సమాచారం చూడండి

పట్టభద్రుల ఓటరు నమోదుపై ప్రత్యేక దృష్టి

ఎమ్మెల్సీ ఎన్నికల్లో(MLC Elections) ఓటు హక్కు వినియోగించుకోవాలనుకునే అర్హులైన పట్టభద్రులు ఓటరుగా నమోదు చేసుకోవడం కీలకం. ఈ నేపథ్యంలో ఓటరు నమోదు ప్రక్రియను పార్టీ శ్రేణులు ఉద్యమంలా చేపట్టాలని సమావేశంలో దిశానిర్దేశం చేశారు. ఖమ్మంలో జరిగిన ఈ సమావేశంతో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల కోసం కాంగ్రెస్ పార్టీ తన కార్యాచరణను మరింత వేగవంతం చేయడంపై దృష్టి సారించింది.

ఆర్టీసీ యూనియన్ ఎన్నికల్లో అధికార పార్టీకి షాక్

మొదటి పేజీ తరువాయి

బొంతు రామ్మోహన్ ప్రచారం చేసినప్పటికీ కార్మికుల మద్దతు ఆ కూటమికి ఆశించిన స్థాయిలో లభించలేదు. శుక్రవారం జరిగిన ఎన్నికల్లో టీఎస్ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ (ఈయూ), తెలంగాణ మజ్దూర్ యూనియన్ (టీఎంయూ), నేషనల్ మజ్దూర్ యూనియన్ (ఎన్ఎంయూ) కూటమి విజయం సాధించింది. కాంగ్రెస్ మద్దతుతో బరిలోకి దిగిన తెలంగాణ ఆర్టీసీ వర్కర్స్ యూనియన్ (టీడబ్ల్యూయూ), స్టాఫ్ వర్కర్స్ అండ్ ఫెడరేషన్ (ఎస్డబ్ల్యూయూ) కూటమికి నిరాశ ఎదురైంది. ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ లేదా దాని అనుబంధ కార్మిక సంఘం ఏ కూటమికీ మద్దతు ప్రకటించలేదు. అధికార పార్టీకి చెందిన ముఖ్య నేతలు ప్రచారం చేసినప్పటికీ, కార్మిక సంఘాల ఎన్నికల్లో కాంగ్రెస్ మద్దతు కూటమి విజయం సాధించలేకపోవడం రాజకీయంగా చర్చనీయాంశంగా మారింది.

హైదరాబాద్ అభివృద్ధిపై సీఎం రేవంత్ సమీక్ష

మొదటి పేజీ తరువాయి

ఫ్యూచర్ సిటీ, చందన్‌వల్లి, ఆలూరులోని డేటా సెంటర్లు, ఇతర పరిశ్రమలకు రీసైకిల్డ్ వాటర్ అందించేలా చర్యలు చేపట్టాలని సీఎం సూచించారు. ఎత్తైన భవనాలు, ల్యాండ్‌స్కేప్‌లు, పార్కుల్లోనూ శుద్ధి చేసిన వ్యర్థజలాలను వినియోగించేలా ప్రణాళికలు రూపొందించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో సీఎం కార్యదర్శి మాణిక్‌రాజ్, హైదరాబాద్ మెట్రో రైల్ సలహాదారు ఎన్‌వీఎస్ రెడ్డి, అదనపు మేనేజింగ్ డైరెక్టర్ అజిత్‌రెడ్డి, మూడు నగర పోలీస్ కమిషనరేట్ల పరిధిలోని కార్పొరేషన్ల కమిషనర్లు ఆర్.వి.కర్ణన్, సృజన, వినయ్‌కృష్ణారెడ్డి, వాటర్‌బోర్డు ఎండీ అశోక్‌రెడ్డి తదితర అధికారులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీకే టోపీ.. రూ.25 లక్షలు స్వాహా!

సొంతం కాని భూమిని అమ్ముతామంటూ మోసం.. తండ్రి, కొడుకుపై కేసు

దశ, హైదరాబాద్: ఆంధ్రప్రదేశ్ ఎమ్మెల్సీ సి.రామచంద్రయ్యను భూమి పేరుతో మోసం చేసి రూ.25 లక్షలు కాజేసిన ఘటన హైదరాబాద్‌లో వెలుగుచూసింది. మాదాపూర్ 100 ఫీట్ రోడ్డులో తమకు 5.5 ఎకరాల భూమి ఉందని, దానిని విక్రయిస్తున్నామని జూబ్లీహిల్స్‌లో నివాసం ఉంటున్న రామచంద్రయ్యను పేరూరు తులసిగోపాల్, ఆయన కుమారుడు గిరిధర్ నమ్మించినట్లు ఆరోపణలు ఉన్నాయి. వారి మాటలు నమ్మిన ఎమ్మెల్సీ రూ.25 లక్షలను అడ్వాన్స్‌గా చెల్లించారు. అనంతరం భూమికి సంబంధించిన అసలు పత్రాలు చూపించాలని కోరగా వారు తప్పించుకుని తిరిగినట్లు తెలిసింది. దీంతో అనుమానం వచ్చిన రామచంద్రయ్య విచారించగా, సదరు భూమి తులసిగోపాల్‌కు చెందినది కాదని తెలిసినట్లు సమాచారం. మోసపోయినట్లు గుర్తించిన ఎమ్మెల్సీ జూబ్లీహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

Printed, Published and Owned by B.KALPANA and Printed at Kalpana Publications , Flat No.101,Sri Heights Apartment,Shilpi Colony,Pasumamula Road,Pedda Amberpet,Rangareddy,Telangana-501505, and Published at Flat No.101,Sri Heights Apartment,Shilpi Colony,Pasumamula Road,Pedda Amberpet,Rangareddy,Telangana-501505. Editor: B.KALPANA. PRGI.No.TGTEL/25/A4195. Cell 9848288850, namasteshekar@gmail.com